కాటమయ్య ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

పోచారం: అన్నోజిగూడలోని కాటమయ్య ఆలయంలో మాజీమంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక వికాసానికి ఆలయాలు ఎంతో అవసరమన్నారు. ప్రభుత్వం కూడా ఆలయాల అభివృద్ధికి సహకరిస్తోందన్నారు. స్థానిక నేతలు, మాజీ ప్రజా ప్రతినిధులు, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ



పట్టాలు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నేతలు

మేడ్చల్: ప్రభుత్వం నుంచి మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను మేడ్చల్ పట్టణంలోని కాంగ్రెస్ నేతలు వార్డు ఆఫీసర్లతో కలిసి శనివారం పంపిణీ చేశారు. వివిధ వార్డులలో లబ్ధిదారులకు పట్టాలను అందజేశారు. కాంగ్రెస్ నేతలు శ్రీనివాస్‌రెడ్డి, కౌడే మహేష్, మధుకర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కీసర: కీసరలోని గోరంటి రమేష్ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న కీసర మండల బీఆర్ఎస్ నాయకులు గుర్రం శ్రీధర్‌రెడ్డి శనివారం రమేష్‌ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. రూ.5 వేల నగదు సాయం అందజేశారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

కీసర: రాంపల్లి దాయరలో వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి శనివారం కీసరకు చెందిన మణికంఠ రియల్ ఎస్టేట్ అధినేత చింతల సతీష్ రూ.26 వేలు విరాళంగా అందజేశారు.

2న కలెక్టరేట్‌లో తెలంగాణ అవతరణ దినోత్సవం

సాక్షి, సిటీ బ్యూరో: మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లాలో 2న తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవానికి తెలంగాణ ప్రభుత్వ చీఫ్‌విప్ డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం ఆవరణలో జరిగే వేడుకల్లో ఆయన అవార్డులు ప్రదానం చేస్తారు. ఈ కార్యక్రమానికి ప్రజలు పెద్ద ఎత్తున హాజరు కావాలని పిలుపునిచ్చారు.

పార్టీ పదవి కోసం తప్పుడు గుర్తింపు కార్డు

అల్వాల్: పార్టీ పదవికోసం తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో పదవి పొందిన ఓ బీజేపీ నాయకుడిపై కేసు నమోదైంది. వివరాల ప్రకారం.. మల్కాజిగిరి నియోజకవర్గం డివిజన్ కమిటీ ఎన్నికలు నిర్వహించింది. పార్టీ నిబంధనల ప్రకారం డివిజన్ అధ్యక్ష పదవికి పోటీ చేసేవారు 45 ఏళ్ల లోపు ఉండాలి. వెంకటాపురం డివిజన్ ఎన్నికల్లో పోటీ చేసి గెలిచిన శ్రీధర్‌రెడ్డిపై కొందరు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆయన వయస్సు 27-03-1977కి బదులు 1981గా మార్పు చేసుకున్నాడు. ఈ మార్పుతో ఆయనను డివిజన్ ప్రెసిడెంట్‌గా ప్రకటించారు. దీంతో కనాజీగూడ ఇందిరానగర్‌కు చెందిన సుప్రియరాజ్ చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. విచారించిన అధికారులు శ్రీధర్‌రెడ్డి తప్పుడు వివరాలు అందించి ఎన్నికల గుర్తింపుకార్డు పొందాడని నిర్ధారించి అల్వాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు .

కుమార్తెలతో సహా తల్లి అదృశ్యం

మల్కాజిగిరి: ఇద్దరు చిన్నారులతో సహా తల్లి అదృశ్యమైన ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై సునీల్ తెలిపిన వివరాల ప్రకారం.. గౌతంనగర్‌కు చెందిన బత్తుల ప్రదీప్ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ప్రేమ వివాహం కాగా.. భార్య పద్మ(28), కూమార్తెలు హారిణి(5),దావని(4) ఉన్నారు. కుటుంబసమస్యలతో ఈనెల 14న ఇద్దరు పిల్లలను తీసుకుని భార్య ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో శుక్రవారం రాత్రి భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కనుమరుగైనా కనిపిస్తున్నాయ్ !

ఇంకా కొనసాగుతున్న జిల్లా పరిషత్, మండల పరిషత్‌లు ● గత మూడ్రోజులుగా విధుల్లోనే ఉద్యోగులు, అధికారులు

మేడ్చల్: నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు మున్సిపాలిటీలుగా మారినా.. నియోజకవర్గంలోని జిల్లా పరిషత్, మండల పరిషత్‌లు ఇంకా కొనసాగుతున్నాయి. గ్రామాలన్నీ మున్సిపాలిటీలుగా మారి మున్సిపాలిటీలకు కమిషనర్‌లు వచ్చి, మూడ్రోజులవుతున్నా.. మండల, జిల్లా పరిషత్‌లు యధావిధిగా కొనసాగుతున్నాయి.

బాధ్యతలు లేక.. ఆదేశాలు రాక..

ఎలాంటి అధికారాలు, పాలన బాధ్యతలు లేకున్నా.. అధికారులు తాము పనిచేసే కార్యాలయాలకు ఇంకా వచ్చి వెళ్తున్నారు. మేడ్చల్ నియోజకవర్గంలో 5 మేడ్చల్, శామీర్‌పేట్, మూడు చింతలపల్లి, కీసర ఘట్‌కేసర్ ఉండగా.. 6 నెలల క్రితం కీసర,ఘట్‌కేసర్ మండలాల్లో మిగిలిన గ్రామాలు సమీప మున్సిపాలిటీల్లో విలీనం కాగా.. మేడ్చల్, శామీర్‌పేట్, మూడు చింతలపల్లి మండల పరిషత్ కొనసాగాయి. 3 మండల పరిషత్‌లు ఉండటంతో జిల్లా పరిషత్ కొనసాగింది. తాజాగా మూడ్రోజుల



మేడ్చల్ మండల పరిషత్ కార్యాలయం



మేడ్చల్ జిల్లా పరిషత్ కార్యాలయం

క్రితం 3 మండలాల్లో ఉన్న గ్రామాలను ఎల్లంపేట్, మూడు చింతలపల్లి, అలియాబాద్ మున్సిపాలిటీలుగా మార్చి వాటిని పూర్తిగా మున్సిపల్ పాలనలోకి తీసుకొచ్చి కమిషనర్‌లను నియమించి పాలన ప్రారంభించింది.

ఎక్కడ పోస్టింగ్ వేస్తే అక్కడికెళ్తాం..

పాలనంతా మున్సిపల్‌శాఖ ఆధీనంలోకి వెళ్లినా.. మేడ్చల్ జిల్లా పరిషత్, మేడ్చల్, శామీర్‌పేట్, మూడు చింతలపల్లి మండల పరిషత్‌లు అలాగే కొనసాగుతున్నాయి. పరిషత్‌లకు అధికారికంగా ఎలాంటి ఆదేశాలు ప్రభుత్వం నుంచి రాకపోవడంతో అక్కడ పనిచేసే అధికారులు, గ్రామకార్యదర్శులు, ఇతర సిబ్బంది ఇంకా పంచాయతీరాజ్ ఆధీనంలోనే ఉన్నారు. మండల పరిషత్ రికార్డులు, ఆస్తులు ఇతర సమాచారం ఎవరికి ఇవ్వాలనేది ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాకపోవడంతో మండల పరిషత్‌లలోనే పనిచేస్తున్నామని మండల పరిషత్ ఉద్యోగులు తెలిపారు. అధికారులు ఆదేశాలు ఇస్తే రికార్డులు జిల్లా పరిషత్ అప్పగించి వారు ఎక్కడ పోస్టింగ్ ఇస్తే అక్కడకు వెళ్తామని ఉద్యోగులు చెబుతున్నారు. గ్రామకార్యదర్శులు, ఇతర సిబ్బంది మండల పరిషత్ ద్వారానే పనిచేస్తున్నారని తెలిపారు.

◆ 3 మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లలో దాదాపుగా 50 మంది వరకు ఉద్యోగులు, మరో 30మంది వరకు గ్రామ కార్యదర్శులు ఉన్నారు. ఓ వైపు మున్సిపాలిటీలకు బోర్డులు మారగా.. మండల, జిల్లా పరిషత్‌లు పాత బోర్డులతోనే కొనసాగుతున్నాయి.

ఎరువుల వాడకం తగ్గించాలి



పూడూర్ రైతు సమావేశంలో రైతులు, అధికారులు

మేడ్చల్‌రూరల్: రైతులు ఎరువుల వాడకం తగ్గించాలని, తద్వారా నేలతల్లి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు సూచించారు. 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో భాగంగా శనివారం పూడూర్, సుతారిగూడ గ్రామల్లో రైతులతో సమావేశం నిర్వహించారు. శాస్త్రవేత్తలు వరప్రసాద్, వసంత, సౌమ్య, పరుశురాంలు ఎరువుల వాడకం, సాగునీటి ఆదా, పంటమార్పిడి, పర్యావరణ పరిరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. మండల వ్యవసాయాధికారి అర్చన, ఏఈఓ సుమిత, తేజస్విని, ఏఎంసీ డైరెక్టర్ రాజు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

గుండెపోటుతో జర్నలిస్టు మృతి



సురేష్ (ఫైల్)

ఉప్పల్: ఉప్పల్ ప్రాంతంలో దీర్ఘకాలంగా జర్నలిస్టుగా పనిచేస్తున్న మాదిరాజ్ సురేష్ శనివారం ఉదయం గుండె పోటుతో మృతి చెందాడు. ఆయన మృతిపై పలువురు సీనియర్ జర్నలిస్టులు, జర్నలిస్టు సంఘాల నేతలు తమ తీవ్ర సంతాపం ప్రకటించారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, బీఆర్ఎస్ నేత బన్నాల ప్రవీణ్, శామీర్‌పేట ధర్మారెడ్డి, గోరిగే కృష్ణ తదితరులు నివాళులర్పించారు. వీరితో పాటు బీఆర్ఎస్ నేత రాగిడి లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ నేత మందుముల పరమేశ్వర్‌రెడ్డిలు విచారం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామన్నారు. తక్షణసాయంగా ఎమ్మెల్యే బండారి బాధిత కుటుంబానికి రూ. 25 వేల ఆర్థికసాయం అందించారు.

గంజాయి విక్రేతల రిమాండ్

మల్లాపూర్: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను రిమాండ్‌కు తరలించిన ఘటన నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. నాచారం ఇన్‌స్పెక్టర్ రుద్వీర్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..బిహార్‌కు చెందిన తుంటుస్ కుమార్‌శర్మ (20), బిందేశ్వరిశర్మ(47) కొంతకాలంగా గంజాయిని అక్రమంగా విక్రయిస్తున్నారు. మల్లాపూర్ నాగలక్ష్మీనగర్ కాలనీలో గంజాయి విక్రయిస్తుండగా.. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు రెక్కీ నిర్వహించి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించామన్నారు.

ఫ్లెక్సీలతో ప్రమాదం !

వాహనాలపై పడుతున్నా పట్టించుకోని అధికారులు

పోచారం: ఇష్టానుసారంగా ప్రచార హోరుతో వివిధ రాజకీయ పార్టీలతో పాటు, ప్రజలు శుభకార్యాలు, ప్రారంభోత్సవాలకు ఫ్లెక్సీలను ఏర్పాటు చేసుకుంటున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని జాతీయ రహదారి, ఎన్టీపీసీ, జోడిమెట్ల, నారపల్లి, కొర్రెముల్ చౌరస్తాలు ఫ్లెక్సీలకు నిలయాలుగా మారాయి. వర్షాకాలంలో వీచే గాలులకు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండటంతో పాటు అధికారులు ముందస్తుగా వీటిని తొలగించాలని కోరుతున్నారు. అధికంగా గాలులు వీస్తున్న సమయంలో ఫ్లెక్సీలు విరిగి పడిపోతున్నాయి. కొన్ని సందర్భాల్లో వాహనాలు, పాదచారులపై పడుతున్నాయి. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయంతో పాటు ప్రమాదాలు జరుగుతున్నాయి.



రోడ్డు పక్కన ఓ వాహనంపై పడిన ఫ్లెక్సీ

అనుమతిలేని ఫ్లెక్సీలు.. హోర్డింగులు..

ప్రమాదాలకు కారణమవుతున్న అనుమతిలేని ఫ్లెక్సీలు, హోర్డింగులను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. వీటిని నిషేధించాలన్న డిమాండ్ పెరుగుతోంది.

కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఇవ్వాలి



ఎల్లారెడ్డిగూడలో కంటి పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

ఉప్పల్: అర్హులైన నిరుపేదలకు కల్యాణలక్ష్మి చెక్కులతో పాటు తులం బంగారం కూడా ఇవ్వాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఉప్పల్ తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే తహసీల్దార్ వాణిరెడ్డితో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ.. మండల పరిధిలో 122 చెక్కులను లబ్ధిదారులకు అందజేసినట్లు వివరించారు. కార్పొరేటర్ ప్రభుదాస్, బీఆర్ఎస్ నేత బన్నాల ప్రవీణ్ తదితరులున్నారు.



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండారి, తహసీల్దార్ వాణిరెడ్డి

ఉచిత వైద్య శిబిరంతో పేదలకు మేలు

కాప్రా: నిరుపేదల ఆరోగ్యం కోసం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం ఎల్లారెడ్డిగూడలోని మల్లారెడ్డి గార్డెన్స్‌లో కిమ్స్ ఫౌండేషన్ సహకారంతో బీఎల్ఆర్ ట్రస్ట్, చాముండేశ్వరి గురుదత్తా ట్రస్ట్ ఆధ్వర్యంలో సంయుక్తంగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ఆరోగ్యంపై పేద ప్రజలు నిర్లక్ష్యం, అజాగ్రత్త వ్యవహరించకుండా అవగాహన కల్పించేందుకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం హర్షనీయమన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరం ద్వారా అల్ట్రా సౌండ్ అబ్డామినల్, యూజీఐ ఎండొస్కోపి, ప్రోటోస్కోపి, ఈసీజీ, 2 డీఈకో, సీబీపీ, లివర్ ఫంక్షన్ టెస్ట్, సీరం క్రియాటిన్, రాండం బ్లడ్‌షుగర్, లిపిడ్ ప్రొఫైల్, ఫైబ్రోస్కాన్, బోన్‌స్కాన్, యూరిక్‌యాసిడ్ వంటి పరీక్షలు నిర్వహించారు.

మహిళా స్నాచర్స్ దొరికారు..

ఉప్పల్: మహిళ మెడలో నుంచి స్నాచింగ్ చేసిన మహిళలు దొరికారు. శుక్రవారం విజయపురి కాలనీ వర్ష బ్యాంగిల్ స్టోర్ యాజమాని సంధ్య మెడలో నుంచి మూడు తులాల పుస్తెలతాడును దొంగిలించిన మహిళా స్నాచర్స్‌ను పోలీసులు గాలించి అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి పుస్తెలతాడును రికవరీ చేశామన్నారు. నిందితులు హనుమసాయినగర్ ప్రాంతానికి చెందిన ఉష, ఆమె సోదరి శిరీషలుగా గుర్తించి వారిని రిమాండ్‌కు తరలించామన్నారు.

రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలి



డీఎస్ రజిని, తహసీల్దార్ ఘట్‌కేసర్ మండలం

ఘట్‌కేసర్: భూ భారతి చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు 2025, జూన్ 3 నుంచి 13 వరకు నిర్వహించనున్న రెవెన్యూ సదస్సులు అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ డీఎస్ రజని తెలిపారు. రైతుల సమస్యలపై దరఖాస్తులు స్వీకరించి వాటిని పోర్టల్ ద్వారా పరిష్కరిస్తామన్నారు. జూన్ 3న ఘట్‌కేసర్, మజార్‌గూడ, ఏదులాబాద్, 4న కొండాపూర్, కొర్రెముల్, 5న పడమటి సాయిగూడ, ప్రతాపసింగారం, 6న అవుషాపూర్, కాచవానిసింగారం, 9న అంకుషాపూర్, ముత్వెల్లిగూడ, 10న మాదారం, ఇస్మాయిల్‌ఖాన్‌గూడ, 11న మర్పల్లిగూడ, అన్నోజిగూడ, 12న యంనంపేట్‌లో ఉందన్నారు. రెవెన్యూ సదస్సుల్లో అధికారులకు తమ సమస్యలపై దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం

ఘట్‌కేసర్: పట్టణంలోని యంనంపేట్ చౌరస్తా నుంచి మాధవరెడ్డి రైల్వే వంతెన వరకు నిర్మించనున్న రోడ్డు పనులను (ఎఫ్‌డీఆర్) శనివారం ప్రారంభించారు. జాతీయ రహదారుల విస్తరణలో భాగంగా కేంద్రం రూ. 30 కోట్లు కేటాయించింది. ఈ మేరకు హెచ్‌ఆర్‌డీసీ ఆధ్వర్యంలో 2.5 కిలోమీటర్ల మేర 100 ఫీట్ల వరకు రోడ్డును విస్తరిస్తున్నారు. ఈ సందర్భంగా ఎఫ్‌డీఆర్ పద్ధతిని ప్రారంభించిన పనులను మాజీ చైర్‌పర్సన్ పావనీజంగయ్య పరిశీలించారు. రాధాకృష్ణముదిరాజ్, సంజీవరెడ్డి, మల్లేష్, జంగయ్యయాదవ్, ఆంజనేయులు, శ్రీనివాస్, ఫరూక్, రెహమాన్, బాల్‌రెడ్డి, ఖయూమ్ పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న మాజీ చైర్‌పర్సన్ పావనీజంగయ్య

చెరువుల సామర్థ్యంపై హైడ్రా అలర్ట్ !



గూడెం చెరువును పరిశీలిస్తున్న హైడ్రా డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ టీమ్

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గూడెం చెరువును శనివారం హైడ్రా డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ టీమ్ సభ్యులు పరిశీలించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని చెరువులు, నాలాల పరిస్థితి, సామర్థ్యం, వర్షపునీటి ప్రవాహం వంటివి, స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈసారి వర్షాలు ముందుగానే రావడంతో సమస్యలు తలెత్తకుండా పీర్జాదిగూడ, ఘట్‌కేసర్, బోడుప్పల్ ప్రాంతాలకు స్పెషల్ హైడ్రా డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ టీమ్ నెంబర్-33ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అయా ప్రాంతాల చెరువులు, నాలాలను పరిశీలించి సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. హైడ్రా డిజాస్టర్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు. హైడ్రా అత్యవసర సేవలకు 9000113667.

ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం



ప్రతిజ్ఞ చేయిస్తున్న జిల్లా సీనియర్ సివిల్ జడ్జ్ కిరణ్‌కుమార్

కాప్రా: ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మేడ్చల్ -మల్కాజ్‌గిరి జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. పొగాకు ఉత్పత్తులు సేవించడంతో కలిగే అనారోగ్య కారణాలను ప్రజలకు వివరించే లక్ష్యంతో ప్రతి ఏటా మే 31న ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం నిర్వహిస్తారు. పొగాకు వాడకంతో కలిగే ప్రమాదాలు, జీవన హక్కును పొగాకు ఎలా హరిస్తుందనే విషయాలపై భవిష్యత్ తరాలను అవగాహన పెంచడమే ఈ దినోత్సవ లక్ష్యం. దీనిలో భాగంగా జిల్లా న్యాయసేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సుకు జిల్లా సీనియర్ సివిల్ జడ్జ్ డి.కిరణ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై పారా లీగల్ వాలంటీర్స్, కోర్టు సిబ్బంది, న్యాయవాదులతో ప్రతిజ్ఞ చేయించారు.

100 రోజుల కార్యాచరణ ప్రణాళికపై సదస్సు

బోడుప్పల్: రాష్ట్ర ప్రభుత్వం జూన్ 2 నుంచి సెప్టెంబర్ 10 వరకు చేపట్టనున్న 100 రోజుల కార్యాచరణ ప్రణాళికపై శనివారం ఆర్ కన్వెన్షన్‌హాల్‌లో కమిషనర్ ఆధ్వర్యంలో కాలనీసంఘాల అధ్యక్షులు, స్వయం సహాయక సంఘ సభ్యులు, మున్సిపల్ స్టాఫ్, సిబ్బందితో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ శైలజ మాట్లాడుతూ.. చెత్త నిర్వహణ, తాగునీటి సమస్య, ఆస్తి పన్ను సమస్యలు, డ్రైనేజీ, వన మహోత్సవం, వీధి దీపాలు, దోమల నివారణపై అన్ని విభాగాలు సమన్వయంతో 100 రోజుల ప్రణాళికను చేపట్టనున్నట్లు వివరించారు. అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ శ్యామ్‌సుందర్‌రావు, డీఈ చిరంజీవులు, అసిస్టెంట్ ఇంజినీర్ రాకేష్, రెవెన్యూ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, సంగీత, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నారాయణరెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కమిషనర్ శైలజ

ముంచుతున్న వరదలు !

- ప్రమాదం రాకముందే ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని..
- అధికారులకు స్థానిక కాలనీల ప్రజల విజ్ఞప్తి

మేడ్చల్: వర్షాకాలం రాగానే ప్రతి ఏడాది మేడ్చల్ పట్టణంలో పలు కాలనీలు నీట మునుగుతుండగా.. పట్టణం నుంచి గ్రామాలకు వెళ్లే రోడ్లలో లో లెవల్ బ్రిడ్జి ఉండటంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురౌతున్నాయి. అధికారులు తాత్కాలిక చర్యలు చేపట్టే బదులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు రాకముందే తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతి ఏటా మునుగుతున్న వినాయక్‌నగర్..

పట్టణంలో కాలనీల మధ్య ఉన్న తుమ్మచెరువు నిండగానే చెరువు కింద ఉన్న వినాయక్‌నగర్ కాలనీ నీట మునుగుతుంది. తుమ్మచెరువుకు ఆయకట్టు లేకపోవడం, కేవలం ఊట చెరువుగానే ఉండటంతో చెరువుకు అలుగులు, తూములు లేకుండాపోయాయి. అలుగులు పూర్తిగా కబ్జాలకు గురై ఇళ్ల మధ్యలో ఉన్నాయి. మరమ్మతులు చేయకపోవడంతో చెరువు ప్రమాదకరస్థాయిలో నిండిపోతుంది. వినాయక్‌నగర్, హౌజింగ్‌బోర్డు, ఆర్టీసీ కాలనీ ప్రజలు ప్రాణం గుప్పిట్లో పెట్టుకోవాల్సి వస్తోంది. తూము నుంచి నీరు వెళ్లేందుకు వాగు లేకపోవడంతో తూము ద్వారా వదిలిన నీరు రోడ్లపై ప్రవహిస్తూ డ్రైనేజీ కాల్వల ద్వారా వెనక్కి వెళ్తూ.. ఇళ్లలోకి చేరుతున్నాయి. దీంతో కాలనీలు పూర్తిగా జలదిగ్బంధంలో చిక్కుకుంటున్నాయి. వారం 10 రోజుల పాటు వినాయక్‌నగర్‌వాసులు తీవ్ర ఇబ్బందులు పడాల్సివస్తోంది.

తూములకు మరమ్మతులు చేయాల్సిందే..

తుమ్మ చెరువు కట్టకు ఉన్న రెండు తూములను చెరువు నిండకముందే తగిన మరమ్మతులు చేసి నీరు వెళ్లేలా కాల్వలు ఏర్పాటు చేస్తే సగం సమస్య తీరుతుంది. అలుగులు పునరుద్ధరించే అవకాశం లేకపోవడంతో హౌజింగ్ బోర్డ కాలనీలో నూతనంగా నిర్మించిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలోకి చెరువు అవుట్ ఫ్లో నీరు వెళ్లే ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. తుమ్మ చెరువు అవుట్ ఫ్లో నీటి కోసం నిర్మిస్తున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం త్వరగా పూర్తిచేస్తే ప్రజలను ప్రమాదం నుంచి తప్పించవచ్చు.



మేడ్చల్ గౌడవెల్లి రోడ్డుపై నుంచి వరద ప్రవాహం (ఫైల్)

లో లెవల్ బ్రిడ్జితో రాకపోకలకు అంతరాయం..

పట్టణం నుంచి గౌడవెల్లి, కిష్టాపూర్‌కు వెళ్లే రోడ్డు, రాయిలాపూర్ నుంచి గౌడవెల్లి వైపు, రాయిలాపూర్ నుంచి బండమాదారం వెళ్లే రోడ్డులో లో లెవల్ బ్రిడ్జిలు ఉండటంతో వర్షాకాలంలో వాగులు పొంగుతుండటంతో ఆ రూట్లల్లో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ఈ మార్గాల్లో బ్రిడ్జిల నిర్మాణం ఏళ్లుగా అవసరం ఉన్నా.. నిర్మాణం మాత్రం చేయడం లేదు. భవిష్యత్తులో రాకపోకలు నిలిచిపోకుండా కనీసం మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



జలదిగ్బంధంలో వినాయక్‌నగర్ కాలనీ (ఫైల్)